ప్రజాశక్తి
శనివారం 8 ఫిబ్రవరి 2025
5
శ్రీకాకుళం



విద్యతో పాటు న్యాయ విజ్ఞానం అవసరం

శ్రీకాకుళం లీగల్ : విద్యతో పాటు న్యాయ విజ్ఞానం ప్రతి ఒక్కరికీ అవసరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నాడు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన ఈనెల తొమ్మిదో తేదీన ప్రపంచ వెట్టిచాకిరీ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని తిరుమల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. రాజ్యాంగం పిల్లలకు అనేక హక్కులు కల్పించిందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. స్వేచ్ఛ, సమానత్వం రాజ్యాంగం కల్పించిన హక్కులని, వీటిని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ సభ్యులు గేదెల ఇందిరా ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ వి.టి నాయుడు, ఎం.వి.జి శంకర్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే శిరీషకు వినతిపత్రం అందజేస్తున్న జీడి రైతు సంఘం నాయకులు

'జీడి'కి మద్దతు ధర ప్రకటించాలి

ప్రజాశక్తి - పలాస

ఉద్దానంలో పండిస్తున్న 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, జీడి రైతుసంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే గౌతు శిరీషకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికంగా పిక్కలను కొనుగోలు చేసిన తర్వాతే విదేశీ పిక్కల దిగుమతులకు అనుమతి ఇవ్వాలని కోరారు. జీడి పరిశోధనా కేంద్రాలు ప్రాంతాల వారీగా ఏర్పాటు చేసి, అభివృద్ధి చేసిన నాణ్యమైన మొక్కలు రైతులకు అందించాలని కోరారు. జీడి పంట విస్తరణకు, జీడి తోటల పునరుద్ధరణకు ప్రభుత్వం రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ ద్వారా ఎకరం జీడి తోట అభివృద్ధికి మూడేళ్లకు రూ.94 వేలు రైతులకు క్షేత్రస్థాయిలో అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. జీడి పంటకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించాలని, రైతువారీ సాగు విస్తీర్ణం నమోదు చేసి జీడి పంటకు వాతావరణ బీమా అమలు చేయాలన్నారు. జీడి పంట ప్రాంతంలో జీడి పిక్కలు, జీడి పళ్ల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. జీడి రైతులకు జీడి పిక్కలు ఆరబెట్టేందుకు టార్పాలిన్లు ఉచితంగా అందించాలన్నారు. పలాస కేంద్రంగా జీడి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వీటిపై ఎమ్మెల్యే శిరీష స్పందిస్తూ జీడి పంటకు గిట్టుబాటు ధర కోసం అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించానన్నారు. జీడి పండే ఇతర జిల్లాల ఎమ్మెల్యేలతో కలిసి జీడి పంట మద్దతు ధర కోసం కృషి చేస్తానని హామీనిచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎన్.గణపతి, జి.బాలకృష్ణ, కె.ఆదినారాయణ, మడ్డు రాఘవరావు, జి.నీలకంఠం, బర్ల గోపి, లండ జీవన్ తదితరులున్నారు.

చి'వరి' వరకు ఎదురుచూపులేనా..?

- ఖరీఫ్‌లో మార్కెట్‌లోకి ఏడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం
- ఇప్పటివరకు 4.53 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు
- లక్ష్యం పూర్తయిందనే పేరుతో 19 కేంద్రాల్లో కొనుగోలు నిలిపివేత
- రైతుల వద్ద ఉండిపోయిన వేలాది టన్నుల ధాన్యం

ఖరీఫ్‌లో చివరి గింజ వరకు ధాన్యం కొంటామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పలు సందర్భాల్లో ప్రకటించారు. అమాత్యుని ప్రకటనలకు భిన్నంగా జిల్లాలో ధాన్యం కొనుగోలు పరిస్థితి నెలకొంది. ధాన్యం కొనుగోలు కోసం రైతులు చి'వరి' వరకూ వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పండిన ధాన్యంలో ఇప్పటివరకు 64 శాతం మేరే కొనుగోలు చేశారు. లక్ష్యం పూర్తయిందనే పేరుతో అధిక శాతం కేంద్రాల్లో సేకరణ ఆపేశారు. రైతుల వద్ద ఇప్పటికీ వేల టన్నుల ధాన్యం ఉండిపోవడంతో, ప్రభుత్వం ఎప్పుడు కొనుగోలు చేస్తుందా అని ఎదురుచూస్తున్నారు. అదనపు ధాన్యం కొనుగోలు కోసం ప్రభుత్వానికి రాశామని, అనుమతి వచ్చిన వెంటనే సేకరణ ప్రారంభిస్తామంటూ అధికారులు చెప్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి


జి.సిగడాం మండలం బాతువలో ఓ గదిలో ధాన్యం బస్తాలను భద్రపరిచిన రైతులు

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 3,59,495 ఎకరాల్లో వరి వేశారు. తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. రైతుల అవసరాలు, తిండి గింజలకు పోనూ ఏడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వరకు మార్కెట్‌లోకి రావచ్చని పౌరసరఫరాల సంస్థ అధికారులు అంచనా వేశారు. మార్కెట్‌లోకి వస్తుందని అంచనా వేసిన ధానాన్ని కొనుగోలు చేయకపోవడంతో, చాలా ధాన్యం టన్నుల కొద్దీ ధాన్యం ఉండిపోయింది. ఆమదాలవలస మండలంలో 22 వేల టన్నులకు పైగా ధాన్యం మార్కెట్‌లోకి వస్తుందని అంచనా వేయగా, 13,873 టన్నుల ధాన్యాన్నే సేకరించారు. ఎచ్చెర్లలో 11వేలకు పైగా టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేయగా 6,025 టన్నుల ధాన్యాన్నే కొనుగోలు చేశారు. జి.సిగడాంలో 21 వేల టన్నులకు పైగా ధాన్యం వస్తుందని అంచనా వేయగా, ప్రస్తుతం 14,948 టన్నుల ధాన్యాన్నే కొనుగోలు చేశారు. గారలో 31 వేల టన్నుల ధాన్యం వస్తుందని భావించగా 20,967 టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించారు. శ్రీకాకుళం మండలంలో 29 వేల టన్నులకు పైగా ధాన్యం వస్తుందని భావించగా 19,831 టన్నులను కొనుగోలు చేసి ఆపేశారు. జిల్లాలోని అత్యధిక మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

నాడు లక్ష్యం పెంచి అదనంగా కొనుగోలు

జిల్లాలో 2023 ఖరీఫ్‌లో 3,82,650 ఎకరాల్లో వరి సాగవ్వగా... 8,11,120 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. రైతుల సొంత అవసరాలు, ఇతర అమ్మకాలు పోనూ సుమారు 4.38 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని అనుకున్నారు. ఇప్పటి మాదిరిగానే ఫిబ్రవరి మొదటి వారంలోనే ఆ లక్ష్యం పూర్తయిపోయింది. అప్పటికే రైతుల వద్ద పెద్దఎత్తున ధాన్యం నిల్వలు ఉండిపోయాయి. రైతులు, రైస్ మిల్లర్లు అప్పటి మంత్రి ధర్మాన ప్రసాదరావును కలిసి లక్ష్యం పెంచాలని కోరారు. అప్పటి పౌర సరఫరాల మంత్రితో మాట్లాడిన తర్వాత మరో 70 వేల టన్నులకు అనుమతిచ్చారు. దీంతో ధాన్యం లక్ష్యం 5.08 లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. 2023 ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితులు, కరువు తలెత్తడంతో దిగుబడి బాగా తక్కువ వచ్చింది. ఈసారి వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో పంట బాగా చేతికొచ్చింది. రైతుల అవసరాలు, తిండి గింజలకు పోనూ ఏడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వరకు మార్కెట్‌లోకి రావచ్చని పౌర సరఫరాల సంస్థ అధికారులు అంచనా వేశారు. అన్నీ లెక్కగట్టి చివరకు 4.90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు. దీంతో రైతుల వద్ద టన్నుల కొద్దీ ధాన్యం ఉండిపోయింది.

దళారులకు అమ్ముకోవాల్సిందేనా?

జిల్లాలోని 11 మండలాల్లో ధాన్యం కొనుగోలును నిలిపివేశారు. దీంతో ఆయా ప్రాంతాల రైతుల వద్ద సుమారు రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండిపోయింది. కొన్ని ప్రాంతాల్లో మినుము, పెసర తదితర అపరాల సాగుతో నూర్పులు ఆలస్యంగా సాగాయి. డిసెంబరులో పలుమార్లు వచ్చిన అల్పపీడనాలు, వర్షాల ప్రభావంతో కోతలు, నూర్పులు ఆలస్యమయ్యాయి. ఫలితంగా ఆయా రైతుల వద్ద ధాన్యం ఉండిపోయింది. రైతుల వద్ద ఉన్న ధాన్యంపై ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకోనుందో చూడాల్సి ఉంది. ప్రభుత్వం ధాన్యం తీసుకోకపోతే దళారులే దిక్కయ్యే పరిస్థితి కనిపిస్తోంది. వ్యవసాయ మంత్రి జిల్లాలో ఉండీ తమకు ఈ కష్టమేమిటని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగం అమలు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల సందర్భంగా రెండో రోజు శుక్రవారం అరసవల్లిలోని ఒక కళ్యాణ మండపంలో నిర్వహించిన ప్రతినిధుల సభలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1947 - 2014 మధ్య పాలించిన కేంద్ర ప్రభుత్వాలు రూ.55 లక్షల కోట్లు అప్పు చేస్తే, మోడీ పదేళ్ల పాలనలో అప్పు రూ.196 లక్షల కోట్లు చేశారని చెప్పారు. బిజెపి పాలనలో దేశంలోని అన్ని రంగాలు తిరోగమనం దిశగా పయనిస్తున్నాయన్నారు. రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంలో కీలకంగా ఉన్నా, రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాబట్టడంలో విఫలమైందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీలూ రాష్ట్రంలో అమలు కావడం లేదని, ఉద్యోగస్తులకు ఒకటో తేదీన జీతాలు ఇవ్వలేని పరిస్థితి దాపురించిందన్నారు. పవన్ కళ్యాణ్ సనాతన వాదం పేరుతో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని తీసుకెళు తున్నారని విమర్శించారు. సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ దేశాన్ని కార్పొరేట్, మతతత్వ శక్తులు పాలిస్తున్నాయని... వాటి నుంచి దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత దేశ పౌరులపై ఉందన్నారు. దేశంలో మీడియా రంగం కూడా రెండు కార్పొరేట్ శక్తుల చేతుల్లోనే ఉందన్నారు. అంతకుముందు ఎఐవైఎఫ్ అరుణ పతాకాన్ని ఎఐవైఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి సత్యనారాయణ మూర్తి ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. సభలో విశ్రాంత వైస్ ఛాన్సలర్ హనుమంతు లజపతిరాయ్, ఎఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్, ఎఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి జి.ఈశ్వరయ్య, ఆహ్వాన సంఘం అధ్యక్షులు చాపర సుందర్‌లాల్, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.వలరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచాలి

ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని 30 పడకల సామాజిక ఆస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆస్పత్రిలో నెలకొన్న పలు సమస్యలను వైద్యాధికారి ధర్మాన హరిణి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆస్పత్రిలో చిన్నపిల్లల వైద్యుని పోస్టు ఖాళీగా ఉందని, జనరేటర్ లేకపోవడంతో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. ఎక్స్ రే ప్లాంట్ మంజూరైనా, ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. చిన్నపిల్లల వైద్య సేవలు అందించడానికి ఉచితంగా సేవలు అందిస్తానని సమావేశానికి హాజరైన సీనియర్ చిన్న పిల్లల వైద్యులు చాపర సుధాకర్ తెలిపారు. 30 పడకల ఆస్పత్రిలో అన్ని విధాలుగా నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయనే నమ్మకాన్ని ప్రజల్లో కల్పించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఆశా కార్యకర్తలందరూ గర్భిణులను కాన్పుల నిమిత్తం జొన్నవలస సామాజిక ఆస్పత్రికి తీసుకొచ్చే విధంగా మండల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి రూ.20 లక్షల వరకు ఖర్చవుతాయని, ఆస్పత్రి ఖాతాలో రూ.రెండు లక్షలు మాత్రమే ఉందని వైద్యాధికారి హరిణి తెలపగా, నివేదికలు రూపొందిస్తే నిధులు సమకూర్చడానికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు. సమావేశంలో ఎంపిడిఒ రోణంకి వెంకటరావు, ఆస్పత్రి పాలకవర్గ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ఆస్పత్రిలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రవికుమార్

విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తా...

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి - విశాఖపట్నం

విద్యారంగ పరిరక్షణకు 17 ఏళ్లుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిర్విరామంగా కృషి చేశారని, తాను గెలిస్తే అదే స్ఫూర్తితో పని చేస్తానని పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి స్పష్టం చేశారు. విశాఖ జిల్లా భీమిలిలో యుటిఎఫ్ ప్రతినిధులతో కలిసి శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఫిబ్రవరి 27న జరుగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. 2007లో శాసన మండలి పునరుద్ధరించిన తర్వాత గెలుపొందిన ఎమ్మెల్సీలు ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్)గా ఏర్పడి ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రైవేట్ విద్యా సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులు, కాంట్రాక్టు అధ్యాపకులు, ఉద్యోగులు, పింఛనుదారులు, నిరుద్యోగుల సమస్యలపై శాసన మండలిలోను, వెలుపలా పోరాటాలు చేసినట్లు వివరించారు. ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి అనేక సమస్యలు పరిష్కరించినట్లు చెప్పారు. కెజిబివి, గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ల సమస్యలు, అప్రెంటిస్ విధానం రద్దు, నోషనల్ ఇంక్రిమెంట్లు, కాంట్రాక్టు అధ్యాపకుల మినిమం టైమ్ స్కేల్, మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ రూల్స్ పరిష్కారంలో సంఘాలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. అనంతరం ఆరిలోవ తోటగరువు జెడ్‌పి ఉన్నత పాఠశాల అధ్యాపకులను కలిసి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.


మాట్లాడుతున్న విజయగౌరి

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

ప్రజాశక్తి - పాతపట్నం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, హాజరు పట్టికను పరిశీలించి పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన మెనూను పరిశీలించారు. వంట వండే పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పాత్రలను ప్రతిరోజూ శుభ్రం చేయాలని సూచించారు. మెనూ ప్రకారం రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని తెలిపారు. కూరగాయలు తాజాగా లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మరోసారి ఇలా జరగకూడదని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ముందుగా గిరిజన రేషన్ డిపో దుకాణాన్ని పరిశీలించి షోకాజ్ నోటీస్ ఇచ్చారు. స్టాకు ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలన్నారు. ప్రరాజుపాలెంలో ఉద్దానం ప్రాజెక్టు-2 పనులను పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేసి తాగునీరు అందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కిరణ్ కుమార్, ఎంపిడిఒ చంద్రకుమారి, ఆర్‌ఐలు, తదితరులు పాల్గొన్నారు.


వంట ప్రదేశాన్ని పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

వ్యాపారం మేరకు జిఎస్‌టి చెల్లించాల్సిందే...

అసిస్టెంట్ కమిషనర్ జి.రాణిమోహన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వ్యాపారం మేరకు పన్నులు చెల్లించాలని లేకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కమిషనర్ (రాష్ట్ర పన్నులు) జి.రాణి మోహన్ అన్నారు. శ్రీకాకుళం సర్కిల్ కార్యాలయంలో టాక్స్ ప్రాక్టీషనర్లతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. సర్కిల్ పరిధిలో కొంతమంది వర్తకులు జిఎస్‌టి మినహాయింపు పరిధి దాటి వ్యాపారం చేస్తున్నా, పన్ను చెల్లించకుండా తప్పించుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో సర్కిల్ రెవెన్యూ పెంచేందుకు అంతా కృషి చేయాలని కోరారు. జిఎస్‌టి రెగ్యులర్, కాంపోజిషన్ స్కీముల్లో కొనసాగుతున్న వారు డిసెంబరు నెల ముగిసిన కాలానికి వెంటనే తమ రిటర్న్సును దాఖలు చేయాలన్నారు. లేకుంటే 18శాతం అపరాధ రుసుము విధించనున్నామని హెచ్చరించారు. ఇటీవల జారీ చేసిన జిఎస్‌టి సర్క్యులర్ ప్రకారం 2017-18, 2018-19, 2019-20 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన పన్ను బకాయిలను మార్చి 31వ తేదీ లోగా చెల్లించే వారికి ప్రభుత్వం అపరాధ రుసుము, వడ్డీని రద్దు చేసిందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశానికి హాజరైన పలువురు టాక్స్ ప్రాక్టీషనర్లు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ నమోదు, రిటర్న్సు దాఖలు తదితర అంశాల్లో ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారాలను సూచించారు. మరికొన్ని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీనిచ్చారు. సమావేశంలో డిప్యూటీ ఎసి బి.కామరాజు, కార్యాలయ జిఎస్‌టి అధికారులు జి.హైమావతి, ఆర్.వేణుగోపాల్, బి.వి.టి రమణారావు, చల్లా శ్రీనివాసరావు, టాక్స్ ప్రాక్టీషనర్లు టి.వి శ్యామ్‌సుందర్, బి.వి రమణ పట్నాయక్, కె.సూర్యం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ రాణి మోహన్

నేటి నుంచి నాటిక పరిషత్ పోటీలు

ప్రజాశక్తి - కవిటి

బల్లెడ అనసూయమ్మ స్మారక తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు మండలంలోని బొరివంకలో శనివారం నుంచి సోమవారం వరకు జరుగనున్నాయి. ఇందులో భాగంగా శనివారం రాత్రి ఏడు గంటలకు శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు గుంటూరు జిల్లా వారి సౌజన్యంతో 'జనరల్ బోగీలు', అదే రోజు రాత్రి తొమ్మిది గంటలకు తెలుగు కళా సమితి విశాఖపట్నం వారి సౌజన్యంతో 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?' అనే నాటికలు ప్రదర్శిస్తారు. ఆదివారం రాత్రి ఏడు గంటలకు పండు క్రియేషన్స్ కొప్పోలు(ఒంగోలు)వారి సౌజన్యంతో 'పక్కింటి మొగుడు', అదే రోజు రాత్రి తొమ్మిది గంటలకు అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురు మేఘం నాటికలు ప్రదర్శిస్తారు. చివరి రోజైన సోమవారం రాత్రి 7 గంటలకు అభినయ ఆర్ట్స్ - గుంటూరు వారి సౌజన్యంతో ఇంద్రప్రస్థం, అదే రోజు రాత్రి 9 గంటలకు సౌజన్య కళా స్రవంతి ఉత్తరాంధ్ర వారి దేవరాగం నాటికలు ప్రదర్శిస్తారు. వీటితో పాటు చివరి రోజు ముగింపు నాటికగా శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం బొరివంక వారి 50వ ప్రదర్శనగా కొత్త పరిమళం నాటిక ప్రదర్శనతో ఈ కార్యక్రమాలు ముగుస్తాయి.


నాటికలకు సిద్ధమైన కళా ప్రాంగణం

గిరిజనుల ప్రాణాలంటే లెక్క లేదా...?

- ధర్మల్ ప్లాంట్ నిలుపుదల చేయకపోతే ఉద్యమం
- ఎస్‌టి కమిషన్ సభ్యులు శంకర్ నాయక్

ప్రజాశక్తి - బూర్జ

గిరిజనులు ఉండే ప్రాంతాల్లో ధర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేసి, వారి బతుకులను బొగ్గుపాలు చేయొద్దని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. గిరిజనుల ప్రాణాలంటే లెక్క లేదా అని ప్రశ్నించారు. మండలంలోని గిరిజన గ్రామం అడ్డూరిపేటలో గిరిజన రైతులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస వద్ద 3,200 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించ తలపెడుతున్న ధర్మల్ ప్లాంట్ నిర్మాణ ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ధర్మల్ ప్లాంట్ నిర్మాణం వల్ల నీరు, గాలి, నేల కలుషితమవుతుందని తెలిపారు. వంశధార రిజర్వాయర్‌లోని నీటిని ప్లాంట్‌కు తరలిస్తే, వేలాది ఎకరాల పంట భూములు బీడు భూములుగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ధర్మల్ పవర్ ప్లాంట్ నిలుపుదల చేయకపోతే, జాతీయ స్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. బూర్జ మండల ప్రాంతంలో ధర్మల్ నిర్మాణ ప్రతిపాదనలు విరమించుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు వాబ యోగి డిమాండ్ చేశారు. గిరిజనులు ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అంగీకరించడం లేదని స్పష్టం చేశారు. అభివృద్ధిని అడ్డుకుంటే అంతు చూస్తామని ఎమ్మెల్యే కూన రవికుమార్ బెదిరింపులకు పాల్పడడం ఎంతవరకు సమంజసమని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం ప్రశ్నించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ పరిషత్ నాయకులు బాడంగి సురేష్, సవర సింహాచలం, సవర ధర్మారావు, సవర కృష్ణ, సవర యాదయ్య, మిన్నారావు అప్పన్న, సురేష్ దొర, కిరణ్, శోభన్, మాధవరావు, కష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్‌టి కమిషన్ సభ్యులు శంకర్ నాయక్

11న అరసవల్లి హుండీ లెక్కింపు

శ్రీకాకుళం : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ హుండీలను ఈనెల 11వ తేదీన లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వై.భద్రాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు ఉదయం ఎనిమిది గంటలకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ సిబ్బంది, అనువంశిక ధర్మకర్త, పాలక మండలి సభ్యులు, అర్చకులు, సందర్శకులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీలను తెరవనున్నట్లు తెలిపారు.

పేరు మార్పు

నాపేరు **గుజ్జు మధు, S/o గుజ్జు లోకేశ్వరరావు** చిరునామా: ఇంటి నంబరు 1-80, రెడ్డిక వీధి, గూడేం గ్రామం, పోస్టు, టెక్కలి మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్. పిన్ కోడ్ 532201,

నా పాస్ పోర్ట్‌లో నా తండ్రి గారు పేరు **గుజ్జు లోకేష్** అని తప్పుగా ముద్రించడం జరిగింది. కావున నా తండ్రి గారి పూర్తి పేరు ఒరిజినల్‌గా **గుజ్జు లోకేశ్వరరావు** గా పరిగణించాలి.

IN THE HON'BLE COURT OF THE SENIOR CIVIL JUDGE, SOMPETA.
O.S.41/2018.

Between:
M. Divya Kumari ....Plaintiff
And:
P. Mallayya and others ......Defendants

To,
D-6: P. Lavanya, W/o Prabhakar, aged 42 years, house-hold duties, resident of Door No.5-742, Ambusoli village, P.O: Kasibugga, Palasa Mandal, Srikakulam Dist.
D-7: Ch. Deepika, W/o Murali, aged 40 years, house-hold duties, resident of Door No.5-742, Ambusoli village, P.O: Kasibugga, Palasa Mandal, Srikakulam Dist.

Please take notice that the plaintiff filed the above suit for declaration and recovery of possession against you and others and it stands posted to **12-02-2025 at about 10-30 A.M.** in the above court for your appearance, you appear either in person or through your Advocate on that day, failing which the matter will be decided as per law.

// BY ORDER //

K.S. PRASAD BABU
ADVOCATE,
Main Road, SOMPETA-532 284,
Srikakulam Dist.

IN THE HON'BLE COURT OF THE SENIOR CIVIL JUDGE SOMPETA
I.A.325/2024 in O.S.62/2012

Between:
B. Nagaraju & others .....Petitioners.
And:
B. Nagayya and others .....Respondents

To,
R-6: K. Rama Rao, S/o Ganapathi, aged 53 years, business, residing at Mogilipadu village in Palasa Mandal, Srikakulam Dist.
R-7: Lodagala Kameswara Rao, s/o not known, aged 56 years, resident of Sivajinagar, A.P.S.R.T.C. Bus stand,P.O: Palasa, Palasa Mandal, Srikakulam Dist.
R-16: Barla Dhana Laxmi, D/o Nagayya, aged 32 years, house hold duties, residing at Mogilipadu village in Palasa Mandal, Srikakulam Dist.

Please take notice that the petitioners filed an F.D.P. against you all before the above court and it is stands posted to **11-02-2025 at about 10-30 A.M.** in the above court for your appearance you appear either in person or through your Advocate on that day failing which the matter will be decided as per law.

//BY ORDER//
K.S. PRASAD BABU
ADVOCATE,
Main Road, SOMPETA-532 284,
Srikakulam Dist.



అధికారులకు సూచనలిస్తున్న ఆర్‌డిఓ కృష్ణమూర్తి

పక్కాగా పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మేజర్ పంచాయతీలో శానిటేషన్ చర్యలను పటిష్టంగా చేపట్టాలని ఆర్‌డిఓ ఎం.కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం టెక్కలిలోని శానిటేషన్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై చెత్త వేయకూడదని స్థానికులకు సూచించారు. కాలువలపై ఆక్రమ నిర్మాణాలను చేపట్టిన వారికి నోటీసులు జారీచేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఆక్రమణదారులు స్పందించకపోతే వెంటనే తొలగించాలన్నారు. ఆక్రమణలను ఉపేక్షించేది లేదని ఆర్‌డిఓ స్పష్టం చేశారు. ఈయనతో పాటు కార్యదర్శి కె.వి.వి జగన్నాథరావు తదితరులున్నారు.

కలెక్టర్‌కు అభినందన

శ్రీకాకుళం: రథసప్తమి రాష్ట్ర పండగగా ప్రకటించిన తరువాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవాలయంలో జరిగిన ఈ వేడుకలు అందరి సమష్టి కృషితో విజయవంతంగా నిర్వహించగలిగామని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సభ్యులు అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారి స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రశంసాపత్రాన్ని అందించారు. ముఖ్యమంత్రి ఈ రథసప్తమి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించడం, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుల కృషితో ఇది సాధ్యమైందన్నారు.

నేడు మెళియాపుట్టి మండల సమావేశం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మెళియాపుట్టి సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు ఎంపిపి రాణా ఈశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపిడిఓ నరసింహ ప్రసాద్ పండా ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిటిసిలు, సర్పంచ్‌లు సమావేశానికి హాజరుకావాలని కోరారు. అలాగే అధికారులు తప్పనిసరిగా పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు.

10న పోలాకి మండల సమావేశం

పోలాకి: ఈ నెల 10న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపిడిఓ జి.రవికుమార్ తెలిపారు. శుక్రువారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 10న ఉదయం 10 గంటలకు ఎంపిపి ముద్దాడ దమయంతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశానికి అదికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

హెల్త్ సెంటర్ అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పురుషోత్తపురం అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జూహితా ఆధ్వర్యంలో పట్టణ ఆరోగ్య పారిశుధ్యం, పోషకాహార కమిటి సమావేశం శుక్రవారం నిర్వహించారు. శానిటేషన్ తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో 1వ వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్ కుమార్, 2వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి చాట్ల తిరుపతి, హెల్త్ సెంటర్ సిబ్బంది, ఆశావర్కర్లు సుగ్గు గుణవతి, డి.కేశవ, మాధవరావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



కుర్చీలు, అట్టలతో విద్యార్థులు

విద్యార్థులకు స్టడీ అవర్స్ కుర్చీలు

ప్రజాశక్తి- కొత్తూరు

మెట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ కుర్చీలు, అట్టలను హెచ్‌ఎం డి.లక్ష్మీ నరసింహం, మెట్టూరు సర్పంచ్ మొజ్జాడ రుక్మిణి, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ జామి భానుమూర్తి, ఉప ఛైర్మన్ జి.లక్ష్మి, గ్రామపెద్దల సమక్షంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ 129 మంది 10వ తరగతి విద్యార్థుల కోసం దాతల నుంచి సేకరించి విద్యార్థుల ఉత్తమ ఫలితాలు సాధనకు పంపిణీ చేసామన్నారు, పబ్లిక్ పరీక్షలకు రానున్న 30 రోజులు చాలా కీలకమని, విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు కుర్చీలు, అట్టలు పంపిణీకి పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ జామి భానుమూర్తి, మొజ్జాడ చక్రపాణి, బూర్లె శ్రీనివాసరావు, బర్రి యతిరాజు, గరుకు యతిరాజు, జె.జనార్ధనరావు, దశరథరావు, పాపారావు, శ్యాంసుందర్, తిరుమలరాజు, సంజీవరావు, బి.సంజీవరావు, జి.గోపాలకృష్ణ, పప్పు రాము, బిల్లింగి కృష్ణారావు, పాఠశాల సిబ్బంది ఇచ్చిన విరాళాలతో పంపిణీ చేశారు.

నిధుల మంజూరుపై హర్షం

కంచిలి: మండల పరిధిలోని అంపురం జాతీయ రహదారి నుంచి ఘాటి ముకుంథపురం వరకు 11 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణానికి రూ.23 కోట్లు నిధులు మంజూరైన నేపథ్యంలో మండల టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో పార్టీ ప్రధాన కార్యదర్శి మాదిన రామారావు ఆధ్వర్యంలో నాయకులు సమావేశమై మాట్లాడుతూ సుమారు 8 పంచాయతీల ప్రజలకు ప్రధాన రహదారైన అంపురం - ఘాటి ముఖంద్రపురం రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ.23 కోట్లు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. నిధులు మంజూరు చేసిన సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, పురంధరేశ్వరి, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పిలక చిన్నబాబు రెడ్డి, పైల రామారావు, కిషోర్ పాడి, బొడ్డ హరిబాబు, భాస్కర్ పాణిగ్రాహి, పైల సూర్యనారాయణ రెడ్డి, టి.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

చెట్లతాండ్రలో అరటి గెలల ఉత్సవాలు

నౌపడ: సంతబొమ్మాళి మండలంలోని చెట్లతాండ్రలో లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో నేటి నుంచి మూడు రోజుల పాటు అరటి గెలల ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వహణ కమిటీ శుక్రవారం తెలిపారు. బీష్మ ఏకాదశి సందర్భంగా ఉత్తరాంధ్రలోని పలు ప్రాంతాలు, ఒడిశా నుంచి ముఖ్య నాయకులు, ప్రముఖులు, యాత్రికులు వేలాదిగా వచ్చి ఉత్సవాల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక క్యూలైన్లు, అరటి గెలలు కట్టేందుకు పందిళ్లు, యాత్రికులకు అన్నదాన సదుపాయం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ ప్రతినిధి పంగ అసిరి నాయుడు, నిర్వాహకులు తెలిపారు.

బడ్జెట్‌కు వ్యతిరేకంగా ర్యాలీ

పర్లాకిమిడి: సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు వివిధ ప్రజా సంఘాలు బుధవారం గజపతి జిల్లా పర్లాకిమిడి కళాశాల కూడలి వద్ద నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద సభ నిర్వహించి వారు మాట్లాడుతూ బడ్జెట్‌లో రైతులకు, కార్మికులకు, సామాన్య ప్రజలకు ప్రభుత్వం మొండి చెయ్యి చూపిందని ఆరోపించారు. ఈ బడ్జెట్ కేవలం కార్పొరేట్లకు దొచిపెట్టిన బడ్జెట్ అని వారన్నారు. కార్యక్రమంలో అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) జిల్లా కార్యదర్శి ముచ్చి బంగారు, సభ్యులు దొండపాణి రైతో, గోకుల బెహరా, గజపతి జిల్లా రైతు కూలీ, రైతు సంఘం (జిజెడ్‌ఆర్‌సిఆర్‌ఎస్) జిల్లా కార్యదర్శి రొక్కం లోకనాథం, సభ్యులు మండల దండేశ్వరరావు, భారతీయ ఖేత్ మజ్దూర్ సంఘ్ (బికెఎంయు) రాష్ట్ర నాయకులు జొన్న సుభాష్, అఖిల భారత కిసాన్ మజ్దూర్ సభ (ఎఐకెఎంఎస్) సభ్యులు సంబ్రు సబర్, సుంక సబర్, పైల మురళి, శ్రీను బెహరా తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి చెట్లు ధ్వంసం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రైతులను అడవి పందులు బెడద వీడడం లేదు. ఖరీఫ్ పంటలను ధ్వంసం చేశాయి. పొలంలో పెట్టిన వరి కుప్పలను విడిచి పెట్టలేదు. ప్రస్తుతం అవి ఉద్యానవన పంటలపై దృష్టి సారించాయి. ఏపుగా పెరిగిన కొబ్బరిచెట్లను అడవి పందులు ధ్వంసం చేస్తున్నాయి. మండలంలోని బెండి, సీతాపురం, పెద్దబొడ్డపాడు, కొండపూరు, తేరపల్లి, కొల్లిపాడు, కుర్మనాథ పురం తదితర గ్రామాల పరిధిలో వీటి సంచారం అధికంగా ఉంది. బెండికొండతో పాటు బెండిగెడ్డ పరీవాహక ప్రాంతంలో ఏపుగా పెరిగిన మడ అడవులను ఆవాసంగా చేసుకుని రాత్రి సమయంలో బయటకు వస్తున్నాయి. 2018లో సంభవించిన తిత్లీ తుపానులో కొబ్బరి, జీడి పంటలకు తీవ్ర నష్టం జరిగింది. తుపానులో నేలకొరిగిన కొబ్బరి చెట్ల స్థానంలో కొబ్బరి మొక్కలను నాటి మూడేళ్ల చెట్లుగా తయారు చేస్తే ఇలా ధ్వంసం చేసి నష్టం కలిగిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొబ్బరి కంద రుచికి అడవి పందులు కొబ్బరి మొక్కలను తవ్వేస్తున్నాయని రైతులు చెబుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి అడవి పందులు సంచారాన్ని అరికట్టాలని రైతులు కోరుతున్నారు.



అడవి పందులు ధ్వంసం చేసిన కొబ్బరి మొక్క

అడవి పందులను అరికట్టాలి



తిత్లీ తుపానులో కొబ్బరి చెట్లు నేలమట్టం అయ్యాయి. వాటి స్థానంలో కొత్త మొక్కలు వేసుకున్నాం. నీరు పోసి పెంచాం. మొక్క మొవ్వు కదుతున్న సమయంలో అడవి పందులు ధ్వంసం చేస్తున్నాయి. ఖరీఫ్ నష్టాలను పూడ్చుకోవాలనే ప్రయత్నం చేస్తుంటే అడవి పందులు దెబ్బ తీస్తున్నాయి. తోట తయారు చేయడం తలకు మించిన భారంగా మారింది.

- హెచ్.శివకుమార్, ఉద్యానవన రైతు, సీతాపురం

పిఎంజె జ్యూయలర్స్ నూతన స్టోర్ ప్రారంభం



ప్రజాశక్తి- శ్రీకాకుళం

దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రియమైన ఫైన్ జ్యూయలరీ బ్రాండైన పిఎంజె జ్యూయలర్స్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో నూతన షోరూమ్‌ను ప్రారంభించింది. భారత పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, అమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ భార్య కూన ప్రమీలతో పాటు పిఎంజె జ్యూయలర్స్ ఎపి బిజినెస్ హెడ్ హైదర్ అలీ, వైజాగ్ క్లస్టర్ డైరెక్టర్ ఆనంద్ జిలగం ఈ కొత్త అవుట్‌లెట్‌ను ప్రారంభించారు. శ్రీకాకుళంలోని కస్టమర్ల విభిన్న అభిరుచులను దృష్టిలో ఉంచుకుని ఈ స్టోర్ ప్రత్యేకంగా రూపొందించబడింది. ఈ సందర్భంగా పిఎంజె జ్యూయలర్స్ ఎపి బిజినెస్ హెడ్ హైదర్ అలీ మాట్లాడుతూ వజ్రాలు, బంగారం, విలువైన స్టోన్స్‌తో విస్తృతమైన డిజైన్లను కలిగి ఉందని, ఇంతకు ముందు చూడని ఆకర్షణయమైన డిజైనర్ ఆభరణాల శ్రేణి, హ్యాండ్ మేడ్ క్రియేషన్‌లు విభిన్న ప్రాంతాల వారీగా వివాహ ఆభరణాలు ఈ సేకరణలో భాగంగా ఉన్నాయన్నారు. అన్ని రకాల ఫంక్షన్లు, పార్టీలు, వేడుకలకు అనువైన తేలికపాటి క్రియేషన్‌లు కూడా ఈ స్టోర్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ నూతన స్టోర్ తమ వినియోగ దారులందరికీ అత్యుత్తమమైన, గతమెరుగని అద్భుతమైన వజ్రాల పెళ్లి ఆభరణాల విస్తృత శ్రేణిని అందిస్తుందన్నారు. కూన ప్రమీల మాట్లాడుతూ పిఎంజె జ్యూయలర్స్ విస్తరణను చూడటం నిజంగా ఆనందంగా ఉందని, నాణ్యత, చేతిపనులపై వారి అంకితభావం గొప్పది, అభినందనీయమైనదని, ఈ కొత్త స్టోర్ శ్రీకాకుళంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఆభరణాల షాపింగ్ అనుభవాన్ని మెరుగుపరుస్తుందన్నారు.

కానిస్టేబుల్, హెచ్‌సి సస్పెన్షన్

ప్రజాశక్తి- పొందూరు

విధులు నిర్వాహణలో నిర్లక్ష్యం వహించిన హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఖాజీపేటకు చెందిన ఇరు పార్టీలకు చెందిన వారు గతనెల 29 నుంచి స్వల్పంగా వివాదాలకు పాల్పడి ఒకరిపై ఒకరు పరస్పరం పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు. ఇరువర్గాలకు చెందిన వారు ఘర్షనలకు దిగుతున్న నేపథ్యంలో ముందస్తు భద్రత నిమిత్తం గ్రామంలో ఫిబ్రవరి 1న పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 2న ఉదయం ఇరువర్గాలకు చెందిన వారు పరస్పరం దాడులకు పాల్పడ్డారు. దాడులకు పాల్పడిన సమయంలో విధుల్లో ఉండాల్సిన పోలీసులు లేకపోవడంతో వారిపై క్రమశిక్షణా చర్యల క్రింద హెడ్ కానిస్టేబుల్ ఎన్ఎస్‌పి.రాజు, కానిస్టేబుల్ ఎస్. అప్పల నాయుడులను సస్పెండ్ చేస్తూ ఈనెల 6న ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిసింది.

కేసులు రాజీ చేయాలి

ప్రజాశక్తి- పలాస

స్థానిక సివిల్ కోర్టులో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఇన్‌ఛార్జి మెజిస్ట్రేట్ సిహెచ్ హరిప్రియ కోరారు. శుక్రవారం కోర్టులో న్యాయవాదులు, పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసులు రాజీకి లోక్ అదాలత్ మంచి వేదికన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎపిపి రమేష్, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జిఎంఎస్ అనిల్ రాజు, న్యాయవాదులు బికెఆర్ పట్నాయక్, హెచ్ సుధారాణి, జి.ప్రభాకర్, విఘ్నేశ్వరరావు, కె.దేవరాజు, రవి, సూపరింటిండెంట్ కృష్ణ, పోలీసులు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యమని విజయనగరం జిల్లా కాళింగుల సంఘం అధ్యక్షుడు, టిడిపి నాయకుడు, విశ్రాంత తహశీల్దార్ పేడాడ జనార్ధనరావు అన్నారు. శుక్రవారం శ్రీహరిపురంలోని తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ 2019 నుంచి 24 వరకు అధికారంలో ఉన్న వైసిపి ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఇటీవలే అధికారంలోకి వచ్చిన టిడిపి సరుబుజ్జిలి మండలంలోని వెన్నెలవలస వద్ద థర్మల్ పవర్ ప్రాజెక్టును నెలకొల్పడాన్ని వ్యతిరేకించడం సరికాదన్నారు. వలసలు అరికట్టడానికే థర్మల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణంపై భూ సేకరణ పనులు మొదలుపెట్టిందని, 2013 భూచట్టం ప్రకారం నిర్వాసితులకు రెండు రెట్లు అధికంగా ఇవ్వడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో న్యాయవాది కంచరాన మురళీధర్, సీపాన వెంకటరావు ఉన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జనార్ధనరావు

భాష్యం పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గలో ఉన్న భాష్యం ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు, టిడిపి నాయకులు దువ్వాడ హేంబాబు చౌదరి కోరారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న భాష్యం పాఠశాలపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం మండల విద్యాశాఖాధికారి సిహెచ్ శ్రీనివాసరావుకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో అర్హతలేని ఉపాధ్యాయులతో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని, పాఠశాలకు పూర్తిస్థాయిలో క్రీడా మైదానం, మౌలిక సదుపాయాలు లేవన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలను నడుపుతున్నారని, ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఫిట్‌నెస్ లేని బస్సుల్లో విద్యార్థులను తీసుకువస్తున్నారని, ఇలా అయితే విద్యార్థుల భవిష్యత్ ఏమవుతుందని ప్రశ్నించారు. పాఠశాల సమస్యలపై పాఠశాల యాజమాన్యం దృష్టికి విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న హేంబాబు



కవిటి : విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

కవిటి: గ్రిగ్స్ పోటీల్లో భాగంగా రాజపురం ఆదర్శ పాఠశాల విద్యార్థులు అండర్-17 వాలీబాల్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో విజేతలకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం. ఈశ్వరరావు మాట్లాడుతూ

విజేతలకు అభినందనలు

విద్యార్థులు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ శ్రీనివాస్, కుమారస్వామి రెడ్డి, పీడీ నేతాజీ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నౌపడ: సంతబొమ్మాళి మండలం ఎం.సున్నాపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు శ్రీకాకుళంలో జరిగిన గ్రిగ్స్ సీనియర్ బాలికల ఖోఖో పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన పోటీల్లో పాల్గొన్న ఎం.సున్నాపల్లి బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించారని హెచ్‌ఎం కొమ్ము సుజాత తెలిపారు. ఖోఖో పోటీల్లో సత్తాచాటిన బాలికలకు పిఇటి రాజుల రెడ్డి, గ్రామపెద్దలు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఇచ్ఛాపురం: ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తద్వారా నేర నియంత్రణకు ఎంతగానో ఉపయోగపడుతుందని రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలో అన్నిగ్రామ పంచాయతీల్లో పర్యటించి ప్రజలు, గ్రామపెద్దల సహకారంతో సిసి కెమెరాలు ఏర్పాటుకు అవగాహన కల్పించారు. ఇటీవల జరుగుతున్న చోరీలు, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా నేర నియంత్రణ చేయడానికి సిసి కెమెరాలు తోడ్పాటు అవుతుందన్నారు. ఇప్పటికే మొదటి విడతగా తులసిగాం, ధర్మాపురం గ్రామ పంచాయతీల్లో మూడు ముఖ్య ప్రాంతాల్లో సిసి కెమెరాలు ఏర్పాటుకు గ్రామపెద్దలు ముందుకు వచ్చారని ఆయన తెలిపారు. మిగిలిన పంచాయతీల పెద్దలు ముందుకి రావాలన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాస్

వెట్టిచాకిరీ చేయిస్తే కఠిన చర్యలు

కోటబొమ్మాళి: ఎవరైన వెట్టి చాకిరీ చేయిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జూనియర్ సివిల్ జడ్జి బిఎంఆర్ ప్రసన్న లత అన్నారు. వెట్టిచాకిరి నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్థానిక సత్యనారాయణ నగర్‌లో మండల న్యాయసేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ వెట్టిచాకిరి అనేది భూస్వామ్య వ్యవస్థ పరిపాలన జరిగే కాలంలో పేదరికం కారణంగా ఉండేదని, తదుపరి ఇది బాగా తగ్గినప్పటికీ ఇప్పటికీ కొన్ని మారుమూల ప్రాంతాల్లో జరుగుతుండడం బాధాకరమన్నారు. ప్రతిఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరు చేసిన పనికి తగ్గ వేతనాన్ని వెంటనే అందజేయాలని, వెట్టిచాకిరి చేయించడం నేరమన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పల్లి వాసుదేవరావు, ధర్మారావు, అప్పలనాయుడు, జీవన్, అశోక్ పాల్గొన్నారు.

సోంపేట: స్థానిక కనకదుర్గ తాపీమేస్త్రీ సంఘ భవనంలో శుక్రవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వెట్టిచాకిరీ నిర్మూలన దినం పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, ఆరవ అదనపు జిల్లా జడ్జి కె.కిషోర్ బాబు తెలిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు టి.మాధవరావుతో పాటు న్యాయవాదులు కె.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ విజయ్ కుమార్, జగదీష్ పండ, ఎం.ధర్మారావు, కార్మికశాఖాధికారి ఎం.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పొందూరు: వెట్టిచాకిరీ నిర్మూలనా దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ చేపట్టారు. వెట్టి చాకిరీ నిర్మూలిద్దామని ప్రతిజ్ఞ చేపట్టారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి.కొండలరావు, మండల విద్యాశాఖ అధికారులు జి. శ్రీరాములు, పి.రాజారావు, న్యాయవాది అశోక్ పాల్గొన్నారు



కోటబొమ్మాళి : సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ప్రసన్న లత

నూతన భవనాలు నిర్మించాలి

ప్రజాశక్తి- పలాస

నియోజకవర్గంలో బైపల్లి, పలాసలో పాత భవనాలు, అద్దె భవనాల్లో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవితమ్మకు పలాస నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త, ఎపి రజక సంక్షేమం అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ దుర్గారావు కోరారు. విజయవాడ గొల్లపూడి బిసి భవనంలో రుణాల సద్వినియోగంపై బిసి కార్పొరేషన్ చైర్‌పర్సన్లు, డైరెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వజ్రపుకొత్తూరు మండలం బైపల్లిలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే మత్స్యకార గురుకుల పాఠశాల 40 ఏళ్ల క్రితం నిర్మించారని, ప్రస్తుతం భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. పాత సోషల్ వెల్ఫేర్ భవనంలో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 188 మంది విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బెండి సమీపంలో గురుకుల పాఠశాల భవన నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు స్థలాన్ని కేటాయించినప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పలాసలో మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో సొంత భవనం లేక అద్దె భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గురుకుల పాఠశాలలకు నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి భవన నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి- రణస్థలం

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు రణస్థలం శాఖ ఆధ్వర్యంలో జీరుపాలేంలో ప్రమాదబీమా సొమ్ము రూ.20 లక్షల చెక్కును అంబటి రాముడుకు శుక్రవారం అందించారు. రణస్థలం గ్రామీణ వికాస్ బ్యాంకులో అంబటి సీతమ్మ రూ.వెయ్యి ఇన్సూరెన్స్ చేసింది. ఇటీవల ఆమె మరణించడంతో రూ.20 లక్షలు భీమా చెక్కుని నామినీ అంబటి రాముడుకు అందించారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ ఎల్.అనంతరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బ్యాంకులో ఇన్సూరెన్స్ కట్టుకుంటే చాలా ఉపయోగాలున్నాయన్నారు. చాలా మంది బ్యాంకు ఖాతాదారులకు అవగాహన లేకపోవడంతో పెద్దగా ఆసక్తి చూపడం లేదన్నారు. ఏ బ్యాంకులో ఖాతా ఉన్నా ఆ బ్యాంకులోనే ఇన్సూరెన్స్ కట్టుకుని బీమాలు పొంది కుటుంబాలకు ఆసరగా నిలవాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ బి.శ్రీనివాసరావు, ఫీల్డ్ ఆఫీసర్ ఎస్.శివప్రసాద్, స్టేట్‌బ్యాంకు జనరల్ మేనేజర్ యు.రామారావు తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న బ్యాంకు అధికారులు

గోల్డెన్ జూబ్లీపై సన్నాహక సమావేశం

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తొలి ప్రిన్సిపాల్ ఎద్దు గోపాల్‌దాస్ నాయుడు అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల నుంచి పలు సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ నెల 21న 50 వసంతాల వేడుకలను చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బండారు రవికుమార్ తెలిపారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులైన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎ.గోవిందరావు, మెట్టూరు హెచ్‌ఎం డిఎల్ నరసింహం, పి.కుల శేఖర అల్వార్, డాక్టర్ సురేష్ పండ, జి.శ్రీరంగనాథం, వి.తిరుమలరాజు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, మండలంలో వైసిపి నూతన కార్యవర్గం ఎన్నిక పాత కార్యవర్గం సభ్యులకే కొనసాగిస్తూ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. పట్టణ అధ్యక్షుడుగా బలివాడ ప్రకాశరావు పట్నాయక్, రూరల్ వైసిపి అధ్యక్షుడుగా పాతర్ల రాజశేఖర్ రెడ్డిని నియమించింది. మరలా పార్టీ అధ్యక్షుడుగా నియమించినందుకు పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డికి, జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, ఇచ్ఛాపురం సమన్వయకర్త, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ రామారావుకు కృతజ్ఞతలు తెలిపారు. నమ్మకంతో మరోసారి అవకాశం ఇచ్చినందుకు పార్టీ బలిపేతానికి కృషి చేస్తామన్నారు.


నౌపడ: సంతబొమ్మాళి వైసిపి మండల అధ్యక్షునిగా భావనపాడు సర్పంచ్ బి.మోహన్ రెడ్డి నియమితులయ్యారు. ఈయన గతంలో కూడా మండల అధ్యక్షుడిగా పనిచేసి పార్టీని బలోపేతం చేయడంలో కృషి చేశారు. మోహన్ రెడ్డి ఎంపికపై టెక్కలి నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్, వైసిపి నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

మెళియాపుట్టి: వైసిపి మండల కన్వీనర్‌గా పోలాకి జయమునిరావు నియమితులయ్యారు. మెళియాపుట్టి గ్రామానికి చెందిన జయమునిరావు ప్రస్తుతం మండల బూత్ కమిటీ ఇన్‌ఛార్జిగా, ఆయన భార్య ప్రస్తుతం ఎంపిటిసిగా ఉన్నారు. ఈయన ఎంపికపై పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

కోటబొమ్మాళి: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని మండల అధ్యక్షుడు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు అన్నారు. మండల అధ్యక్షుడుగా రాజు నియామకంపై ఎంపిపి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెపు రామారావు, నాయకులు పేడాడ వెంకటరావు, సింగుపురం వినోద్, నూక సత్యరాజు, బొడ్డు అప్పన్న తదితరులు అభినందనలు తెలిపారు.

పాతపట్నం: వైసిపి మండల అధ్యక్షుడిగా సవిరిగాన ప్రదీప్ మరోసారి నియమితులయ్యారు. అధిష్ఠానం తనపై నమ్మకంతో రెండోసారి మండల అధ్యక్షుడిగా నియమించడంపై పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి కృతజ్ఞతలు తెలిపారు.

సోంపేట: వైసిపి మండల అధ్యక్షుడిగా శిలగాన భాస్కరరావు నియమితులయ్యారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



రాజశేఖర్ రెడ్డి, ప్రకాశరావుపట్నాయక్, మోహన్ రెడ్డి, జయమునిరావు, హేమసుందర రాజు, ప్రదీప్

ప్రతి విద్యార్థి పారిశ్రామికవేత్తగా ఎదగాలి

పాతపట్నం: ప్రతి విద్యార్థి ఒక పారిశ్రామిక వేత్తగా మారాలని ఇఎండిపి జిల్లా మేనేజర్ ఎ.అనూష అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఎంటర్ ప్రైన్యూరియల్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం అమలు తీరును పరిశీలించారు. ప్రతిఒక్క విద్యార్థి వారి సొంత ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలను కొనుక్కుని, నూతన వ్యాపారాలు చేయాలని, తన ఉద్యోగం కోసం వెతుకులాడకుండా తానే కొంతమందికి ఉద్యోగాలు కల్పించే విధంగా తయారవ్వాలని హెచ్‌ఎం బి.సుజాత అన్నారు. కార్యక్రమంలో నల్ల తారక రామారావు, అనిల్ ప్రధాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పాఠశాలలకు సెలవు లేదు

టెక్కలి: జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 8న శనివారం రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు పనిచేయాలని జిల్లా విద్యా శాఖాధికారి తిరుమల చైతన్య ఆదేశాలు జారీ చేశారు. గతంలో తుపాను సందర్భంగా పాఠశాలకు సెలవులు మంజూరు చేసిన క్రమంలో పాఠశాలల పని దినాలు పెంచాలనే ఉద్దేశంతో రెండో శనివారం పని చేయాలని గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఈనెల 8న పాఠశాల పనిచేస్తుందని తెలియజేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలు జారీ చేయడంతో శని వారం పాఠశాలలు యధావిధిగా తెరుచు కోనున్నాయి.

నగదు చెల్లింపుల ఆరోపణలు అవాస్తవం

నౌపడ: సంతబొమ్మాళి మండలం నౌపడ వైఎస్ఆర్ కాలనీలో ఐదు కుటుంబాలకు గత ప్రభుత్వ హయాంలో పట్టాలు పంపిణీ చేయడంలో తమకు నగదు చెల్లించారనే బాధితుల ఆరోపణలపై వైసిపి నాయకులు పిలకా రవికుమార్ రెడ్డి స్పందించారు. శుక్రవారం 'పట్టాల రద్దుపై ఆందోళన' అన్న శీర్షికన ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు ఆయన స్పందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధితులు పట్టాలు రద్దు కావడంతో ఆవేదనలో ఏవేవో ఆరోపణలు చేస్తున్నారన్నారు. తాను ఎవరి వద్ద ఎలాంటి నగదు తీసుకోలేదని చెప్పారు. పంచాయతీలో 150 పైగా ఇల్లు మంజూరు చేయించామని, ఎవరి వద్ద ఒక్కరూపాయి కూడా తీసుకోలేదని వివరణ ఇచ్చారు. కాగా ఇళ్ల పట్టాలు మంజూరు చేయడం కోసం గతంలో తాము ముడుపులు చెల్లించామని బాధితులు ఆరోపించిన విషయం తెలిసిందే.

ఎంపిడిఒగా రమేష్ నాయుడు



రమేష్‌నాయుడు

మందస: మందస ఎంపిడిఒగా రమేష్‌నాయుడు గురువారం బాధ్యతలు చేపట్టారు. వజ్రపు కొత్తూరు ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న రమేష్ నాయుడుకు పూర్తి అదనపు బాధ్యతలతో మందస మండలానికి ఇన్‌ఛార్జిగా నియమించారు. ఆయనకు మండల పరిషత్ పరిపాలనాధికారి ఋషేశ్వరరావుతో పాటు కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మత్స్యకారుల కష్టాల కథే 'తండేల్'

కథా రచయిత కార్తీక్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాకు చెందిన మత్స్యకారుల కష్టాలు, వారు ఎదుర్కొన్న ఇబ్బందులను చూసి చలించి 'తండేల్' కథ రాశానని ఆ చిత్ర కథా రచయిత కార్తీక్ తెలిపారు. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందూ మొండేటి దర్శకత్వంలో నటించిన తండేల్ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సినిమాకు కథ రాసిన జిల్లావాసి కార్తీక్ నగరంలోని ఎస్‌విసి థియేటర్‌లో తండేల్ యదార్థ గాథకు చెందిన మత్స్యకారులతో కలిసి సినిమా చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశంకు చెందిన మత్స్యకారులు చేపల వేటకు వెళ్లి పాకిస్థాన్ జలాల్లో ప్రవేశించి అరెస్టయి విడుదలయ్యారని, వారి కష్టాలను చూసి కథను రాశానన్నారు. ఈ కథపై మూడేళ్ల పాటు పనిచేశానని చెప్పారు. యదార్థ గాథను సినిమాగా రూపొందించడం, సిక్కోలు యాసతో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయడం జిల్లావాసిగా తనకు ఆనందంగా ఉందన్నారు. సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. సినిమా సక్సెస్ మీట్‌ను జిల్లాలో నిర్వహిస్తామని, జిల్లావాసులు చిత్ర బృందానికి ఘన స్వాగతం పలకాలని కోరారు.